క్లుప్తంగా

రేపు హెచ్ఆర్‌సీఐ సమావేశం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలోని ఓ హోటల్‌లో ఈనెల 23న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ఆర్‌సీఐ) రాష్ట్ర స్థాయి సమావేశం ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు తెలిపారు. సమావేశానికి జాతీయ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, సౌత్ ఇండియా అధ్యక్షుడు హరిప్రసాద్‌తోపాటు పలువురు పాల్గొంటారన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వలస కూలీల వివరాలు తెలియజేయాలి



మాట్లాడుతున్న సీఐ శశిధర్ రెడ్డి

మందమర్రిరూరల్: వివిధ ప్రాంతాల నుంచి ఉపాధికోసం వచ్చే వలస కూలీల వివరాలను పరిశ్రమల నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు చిన్న తరహా పరిశ్రమలను ఎస్సై రాజశేఖర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశ్రమల్లో తప్పకుండా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కూలీలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

నేడు కైతల ఎన్నీల

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో స్థానిక శ్రీశ్రీనగర్‌లో ఉపాధ్యాయుడు రవికుమార్ నివాసం వద్ద ఈనెల 22న కైతల ఎన్నీల (పున్నమి పూట కవుల కలయిక) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి ముత్యం నాగవర్మ తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజా కవి గూడ అంజయ్య సాహిత్యంపై పరి శోధకుడు రాజేశం ప్రసంగం ఉంటుందన్నారు.

ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలి

మంచిర్యాలఅర్బన్: నీట్ పేపర్ లీక్, యూజీసీ నెట్ రద్దుకు కారణమైన ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం పరీక్షల అవకతవకలపై ఎన్‌టీఏ అధికారులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ అభిరామ్, కో–కన్వీనర్ సిద్ధార్థ, వీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అరవింద్, అభినవ్ పాల్గొన్నారు.
చెన్నూర్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏబీవీపీ నాయకులు రాజ్‌కుమార్, శివకుమార్, దివ్య, శశిధర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్సీ విఠల్

తాండూర్: రాష్ట్రస్థాయిలో ఇంటర్మీడియెట్‌లో మూడో ర్యాంక్ సాధించిన తాండూర్ మండల కేజీబీవీ పాఠశాల విద్యార్థిని దుర్గం మమతను ఎమ్మెల్సీ దండె విఠల్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన ఎంపీపీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఎంపీపీ ప్రణయ్ కుమార్, వైస్‌ఎంపీపీ నారాయణ, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలి

వేమనపల్లి: మండలంలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్లు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, రజిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించడం లేదని బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం, పాలు అందజేయడం లేదని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. జూలైలో నిర్వహించే ప్రీ స్కూల్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శిక్షణ సూపర్‌వైజర్లు రజిత, మాధవి, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ రాజేశ్ పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం



జన్నారం: ఇందన్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల యోగాసనాలు



భీమిని: కన్నెపల్లి పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దండేపల్లి: లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల యోగాసనాలు



మందమర్రిరూరల్: యోగా విన్యాసాల్లో పాల్గొన్న ఏరియా జీఎం మనోహర్



చెన్నూర్: కోర్టు ఆవరణలో యోగా సాధన చేస్తున్న జడ్జి

జిల్లాలో శుక్రవారం ఘనంగా యోగా దినోత్సవం జరుపుకున్నారు. మండలాల్లోని పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. బెల్లంపల్లి కోర్టు ఆవరణలో బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముఖేశ్ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. న్యాయవాదులు, సిబ్బందితో కలిసి న్యాయమూర్తి యోగాసనాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారులతో కలిసి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి యోగా చేశారు. వివిధ గనులపై ఆయా గనుల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. జైపూర్ పవర్‌ప్లాంట్‌లో ఉద్యోగులు, కోటపల్లి లో జిల్లా రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, చెన్నూర్ కోర్టు ఆవరణలో జడ్జి రవి, మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌లు యోగాసనాలు వేశారు.



నెన్నెల: కొత్తూర్‌లో ..



కాసిపేట: పల్లంగూడలో..



బెల్లంపల్లి: యోగాసనాలు వేస్తున్న జడ్జి ముఖేశ్



జైపూర్: పవర్‌ప్లాంట్‌లో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



మంచిర్యాలఅర్బన్: యోగాసనాలలో అధ్యాపకులు, విద్యార్థులు



శ్రీరాంపూర్: యోగా చేస్తున్న అధికారులు



వేమనపల్లి: యోగాసనాలు వేస్తున్న కూలీలు



కోటపల్లి: యోగా చేస్తున్న జిల్లా రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్

ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



దండేపల్లి: జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దండేపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని దండేపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ సమీపంలో గల జయశంకర్ విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేష్, గౌరవ అధ్యక్షుడు గంగారాం, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శ్రీధర్, కరుణాచారి, లక్ష్మీనారాయణ, రాజమౌళి, సత్యనారాయణ, కిషన్, సత్యం, గంగాధర్, దైవాకర్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.
శ్రీరాంపూర్: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ 13వ వర్ధంతిని శ్రీరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద జయశంకర్ చిత్రపటానికి ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. సింగరేణిలోని తెలంగాణ కార్మిక సంఘాల బలోపేతానికి ఆయన కృషి చేశారన్నారు. యూనియన్ నాయకులు రమేశ్, సత్తయ్య, బండి రమేశ్, వెంకట్ రెడ్డి, రాజు నాయక్, తిరుపతిరెడ్డి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.
కాసిపేట: మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ 14వ వర్ధంతి కార్యక్రమం సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న భీమయ్య, రాజన్న పాల్గొన్నారు.
మందమర్రిరూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.
కోటపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి పురస్కరించుకొని బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.
రామకృష్ణాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి శుక్రవారం రామకృష్ణాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విఠల్‌నగర్ మూలమలుపు వద్ద గల జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

గనుల వేలంపై నిరసన



కాసిపేట గనిపై నిరసన తెలుపుతున్న నాయకులు



ఆర్కే 7 గనిపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం సింగరేణి పరిధిలోని బొగ్గు గనులను వేలం వేయడంపై కార్మిక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆర్కే 7 గనిపై ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూలు వేర్వేరుగా నిరసన వ్యక్తం చేశారు. ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, ఐఎన్టీయూసీ నాయకులు భీంరావు, పేరం రమేశ్, తిరుపతిరెడ్డి, కుమారస్వామి, అశోక్, వెంకన్న, టీబీజీకేఎస్ నాయకులు రాజునాయక్, రాజేందర్, శ్రీనివాస్ ప్రతాప్, వంశీకృష్ణ, రవీందర్, శ్రావణ్ పాల్గొన్నారు. కాగా సీఐటీయూ ఆధ్వర్యంలో పలు గనులపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. శ్రీనివాస్, చంద్రశేఖర్, సదానందం, సందీప్, వడివేలు శ్రీనివాస్, సుధాకర్, సిరికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.
కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట –2 గనులపై శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ధోరణికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బొగ్గు గనులను టెండర్ల ద్వారా ప్రైవేట్ వారికి అప్పగించేందుకు ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే ఇవ్వాలన్నారు. కాసిపేట గనిపై ఫిట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, నాయకులు రాజేందర్, రవీందర్, సంతోష్, కాసిపేట –2 గనిపై బెల్లంపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.
రామకృష్ణాపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలానికి నిరసనగా మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వేణుగోపాల్, చందు, కృష్ణ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు



బండితో జిల్లా బీజేపీ నాయకులు

మంచిర్యాలక్రైం: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంచిర్యాల బీజేపీ నాయకులు కరీంనగర్‌లో ఆయన నివాసం వద్ద కలిశారు. జిల్లా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. నేషనల్ హైవే 63రోడ్డు ద్వారా ఇప్పటికే మూడు అలైన్‌మెంట్లు మార్చారని, దీని ద్వారా రైతులకు తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ అధికారులు కేంద్రాన్ని తప్పుదోవ పట్టిస్తు ఇక్కడి ప్రజలకు అన్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఇందుకు బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. నాయకులు తుల మధుసూదన్ రావు, రాజమౌళి, తిరుపతి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఎద్దు మృతి

వేమనపల్లి: మండల కేంద్రానికి చెందిన కన్నెపల్లి బక్కయ్య, తల్లి ఎల్లక్కలకు చెందిన ఎద్దు గురువారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందింది. ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేని వారు ఎద్దు మృతితో కన్నీరుమున్నీరయ్యారు. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగించే పేద కుటుంబానికి ఎద్దు మృతి చెందడంతో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లింది. మానవతామూర్తులు స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

రోడ్డు భద్రతపై అవగాహన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో రోడ్డు భద్రతపై ఆర్టీసీ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో గమ్యం అనే మొబైల్‌యాప్‌ను ప్రవేశపెట్టిందని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్ సిగ్నల్స్ పాటించాలని, రద్దీగా ఉన్న బస్సులలో జాగ్రత్తగా ప్రయాణించాలని, బైక్‌పై వెళ్లే వారు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీసీ రాజమౌళి, రవీందర్ పాల్గొన్నారు.

28న కూరగాయల సంత వేలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కూరగాయల సంత (తైబజారు) వేలం ఈనెల 28న నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11: 30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు వేలంలో పాల్గొనడానికి, ఇతర వివరాల కోసం పని వేళల్లో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సమన్వయంతో పని చేస్తే మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠల్

తాండూర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వసభ్య సమావేశంలో పలు శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. గౌరవ సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. దీనికి ఎమ్మెల్సీ విఠల్ స్పందిస్తూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు తగు సమయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని, ఎల్లప్పుడు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాదారుల దోపిడిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సబ్ సెంటర్‌లలో మందులు, పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. గిరి వికాస్ కార్యక్రమం గురించి తండాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిర్యాని తాండూర్ ఫీడర్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, జెడ్పీటీసీ బానయ్య, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచాలి’



మున్సిపాలిటీని పరిశీలిస్తున్న కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల మున్సిపాలిటీని అన్ని రంగాలలో ముందుంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలు, ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో శుభ్రమైన తాగునీటిని అందించాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

యువత ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలి
కోటపల్లి: యువత ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తును ఎంచుకోవాలని ఎస్సై రాజేందర్ గ్రామ యువతకు సూచించారు. ఎసన్‌వాయి గ్రామంలో ఎస్సై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసులు మీకోసం కళాజాత నిర్వహించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన జీఎం
మందమర్రిరూరల్: జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌ను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మందమర్రి ఏరియా జీఎం మనోహర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలోని సింగరేణి బొగ్గు గనులు ఇతర విషయాలపై చర్చించారు.

క్వార్టర్‌ల అలాట్‌మెంట్ కోసం కౌన్సెలింగ్
మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో శుక్రవారం క్వార్టర్‌ల అలాట్‌మెంట్ కోసం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో 9 క్వార్టర్స్ కోసం 12 మంది దరఖాస్తు చేసుకోగా మూడు క్వార్టర్లను ఉద్యోగులకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఎస్వోటుజీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీవైపీఎం మైత్రేయ బంధు, ఐఈడీ రాజన్న ఉన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
చెన్నూర్: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తంగళ్లపలి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేక్ వెంకటస్వామి మచ్చలేని నాయకుడని, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు సత్యనారాయణ రెడ్డి, హిమవంత రెడ్డి, రమేశ్, రాము, నాగరాజు, మధు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి భరోసా
చెన్నూర్: ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.
కోటపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి శుక్రవారం 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి, జెడ్పీకో ఆప్షన్ మెంబర్ అజ్జర్, నాయకులు ఉన్నారు.


బెల్లంపల్లిలో వర్షం
బెల్లంపల్లి: లోటు వర్షపాతంతో ఉన్న బెల్లంపల్లిని ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. గడిచిన మూడు రోజుల నుంచి చిరు జల్లులు కురుస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఓ మోస్తారు వర్షం కురిసింది.

ఆటపాటలతో బోధించాలి
దండేపల్లి: పూర్వ బాల్య విద్యను ఆటపాటలతో బోధించాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ బాల్య విద్యపై మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు.

క్రీడలతో మానసికోల్లాసం
నస్పూర్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని సింగరేణి ప్రాణహిత స్టేడియంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శుక్రవారం ప్రారంభించారు.

ఉత్తమ ట్రైనర్‌గా సంపత్
చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన సిరంగి సంపత్‌కుమార్ ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఉత్తమ ట్రైనర్‌గా ఎంపికయ్యారు. ఇంపాక్ట్ ప్రొఫెసర్ విశ్వనాథ్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌వో

కోటపల్లి: స్థానిక కస్తూర్బాలో సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వసతులు కల్పించాలని కోరుతూ ఎస్‌వో హరిత ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. కోటపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. పదో తరగతిలో కేవలం 20 మంది మాత్రమే ఉన్నారన్న విషయం తెలుసుకొని ఆయన కంగుతున్నారు. పాఠశాలలో బోరు చెడిపోవడంతో విద్యార్థులు ఎవరూ పాఠశాలకు రావొద్దని సూచించినట్లు ఎస్‌వో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, బోరుకు తనవంతు సహాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.